

పెబ్బేర్ పట్టణ వ్యూ

# బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలి

- బీఆర్ఎస్ ఎన్నికల సమన్వయకర్త ప్రమోద్‌రెడ్డి
- పెబ్బేరులో ప్రచారం

పెబ్బేరు, అక్టోబర్ 17: బీఆర్ఎస్‌కు మరోసారి పట్టం కట్టాలని వనపర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల సమన్వయకర్త వంగూరు ప్రమోద్‌రెడ్డి పిలుపునిచ్చారు. పెబ్బేరు పట్టణంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక అంబేద్కర్‌నగర్‌లోని ఒకటో వార్డులోని కర్రెమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన వీధుల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి మరోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని అభ్యర్థించారు. మంత్రి నిరంజన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులతో వనపర్తి నియోజకవర్గం రూపు రేఖలే మారిపోయాయని.. అందుకే ఆయన అభ్యర్థిత్వాన్ని బలపర్చాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి, నాయకులు బుచ్చారెడ్డి, దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ప్రమోద్‌రెడ్డి

# నియోజకవర్గంలో.. పెబ్బేరు ఓటర్లది రెండో స్థానం

- *వనపర్తి తర్వాత అధిక సంఖ్యలో ఇక్కడే*
- *తాజా జాబితాలో 40,810 మంది ఓటర్లు*





పెబ్బేరు, అక్టోబర్ 17 : వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో వనపర్తి మండలం తర్వాత ఎక్కువ ఓటర్లున్న మండలం పెబ్బేరుగా నిర్ధారణ అయింది. త్వరలో జరుగనున్న శాసనసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా ఓటరు జాబితా విడుదల చేసింది. గత సెప్టెంబర్ 19వ తేదీ వరకు స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా ఈనెల 4న ఓటరు జాబితాను ప్రచురించారు. దీన్ని పరిశీలిస్తే నియోజకవర్గంలో మొత్తం 2,65,622 మంది ఓటర్లున్నారు. ఇందులో వనపర్తి పట్టణంతో కలిపి మండలంలో 91,419 మంది ఉండగా..పెబ్బేరు పట్టణంతో కలిపి మండలంలో 40,810 మంది ఓటర్లున్నారు. మిగితా మండలాల్లో ఇంత కంటే తక్కువ సంఖ్యలో ఓటర్లున్నారు. కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం మరో అవకాశం ఇచ్చింది. అకోటబర్1, 2023 వరకు 18 ఏండ్లు నిండిన యువతీ యువకులు ఈనెల 31వరకు ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో మరికొంత మంది ఓటర్లుగా నమోదయ్యే అవకాశాలున్నాయి. దీంతో ఓటర్ల సంఖ్య కొంత మేరకు పెరగొచ్చని అధికారులు భావిస్తున్నారు. పెబ్బేరు మున్సిపాలిటీలో ఓటర్లు 13,594 మంది ఉన్నారు. ఇందులో పెబ్బేరు పట్టణంలో 10,581, చెలిమిల్లలో 3,013 మందిగా నమోదయ్యారు. మున్సిపా లిటీని మినహాయిస్తే మండలంలోని మొత్తం 20 గ్రామ పంచాయతీల్లో 27,216 మంది ఓటర్లుగా తేలారు.

**నియోజకవర్గంలోని మొత్తం ఓటర్ల వివరాలు.. మండలాల వారీగా ఇలా ఉన్నాయి**

| మండలం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| వనపర్తి | 45,633 | 45,782 | 4 | 91,419 |
| పెబ్బేరు | 20,452 | 20,358 | 0 | 40,810 |
| గోపాల్‌పేట | 15,464 | 15,504 | 1 | 30,969 |
| పెద్దమందడి | 15,499 | 15,715 | 1 | 31,215 |
| ఘణపురం | 16,459 | 16,034 | 1 | 32,494 |
| రేవల్లి | 8,876 | 8,624 | 0 | 17,500 |
| శ్రీరంగాపురం | 8,057 | 8,114 | 0 | 16,171 |
| మూసాపేట | 667 | 640 | 0 | 1,307 |
| అడ్డాకుల | 1,864 | 1,873 | 0 | 3,737 |
| **మొత్తం** | **1,32,971** | **1,32,644** | **7** | **2,65,622** |

## కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు మెటీరియల్ అందజేత

వనపర్తి,అక్టోబర్ 17: ప్రభుత్వ ఏఎన్ఎం పోస్టులకు ప్రిపేర్ అవుతున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎం అభ్యర్థులకు ఏవో డాక్టర్ సాయినాథ్‌రెడ్డి సొంత డబ్బుతో మెటీరియల్స్ తెప్పించి డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలోని మెడికల్, హెల్త్ ట్రైనింగ్ సెంటర్లలో ప్రభుత్వ రెగ్యులర్ ఏఎన్ఎం పోస్టులకు సిద్ధమవుతున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు ఏవో డాక్టర్ సాయినాథ్‌రెడ్డి సొంత ఖర్చుతో మెటీరియల్స్ తెప్పించి ఉచితంగా ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో రవిశంకర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మెటీరియల్స్‌ను అందజేస్తున్న డీఎంహెచ్‌వో



కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యబృందం

## పారిశుధ్య కార్మికులకు వైద్యపరీక్షలు

వనపర్తి, అక్టోబర్ 17: పట్టణంలోని మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి మాట్లాడుతూ.. ఏటా మున్సిపల్ కార్మికులు, సిబ్బందికి వైద్యపరీక్షలతోపాటు రక్తపరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వైద్యశిబిరం నిర్వహణకు సహకరించిన వైద్యబృందాన్ని మున్సిపల్ అధికారులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఎంవో రవిశంకర్, డాక్టర్లు చైతన్యకృష్ణ గౌడ్, సిద్ధార్, అనిత, మురళీధర్, కిశోర్, చిన్నమ్మ, థామస్, తారథామస్, ఏఎన్ఎం, ఆశ వర్కర్స్, శానిటర్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, ఆర్డీఎస్ టీం తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో వసతుల ఏర్పాటు

- డీపీవో సురేశ్‌కుమార్

పెబ్బేరు, అక్టోబర్ 17: రానున్న శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కనీస వసతులను కల్పించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం ఆయన పెబ్బేరు మండలం యాపర్లలోని పోలింగ్ కేంద్రంలో నిర్మిస్తున్న మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్లకు ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో రోజారెడ్డి, పంచాయతీ కార్యదర్శి లోకేశ్ పాల్గొన్నారు.



మరుగుదొడ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీపీవో సురేశ్‌కుమార్

## అన్నపూర్ణాదేవీగా అమ్మవారు

పెబ్బేరు, అక్టోబర్ 17: శరన్నవరాత్రి ఉత్సవాలు పెబ్బేరులో ఘనంగా జరుగుతున్నాయి. చిన్నచౌడేశ్వరీ ఆలయంలో సాయిగణేశ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో మంగళవారం అన్నపూర్ణాదేవీగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాయత్రీదేవీగా అలంకరించారు. ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతున్నారు.



అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు

## ఉద్యోగాలు సాధించిన యువతకు సన్మానం

పెబ్బేరు, అక్టోబర్ 17: మండలంలో ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతీ, యువకులను స్థానిక శ్రీకృష్ణ యాదవ సంఘం ఘనంగా సన్మానించింది. మంగళవారం సంఘం భవనం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కానిస్టేబుళ్లుగా ఎంపికైన ఆంజనేయులు, సుప్రజ్యోత్స్న, సురేశ్, ఉమామహేశ్, ఆరోగ్య శాఖలో ఉద్యోగం సాధించిన వెంకటేశ్‌ను శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్ సుమతి, డీఈ కేతన్‌కుమార్, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, మోహన్‌కుమార్, సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, నాగరాజు, రామకృష్ణ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులను సన్మానిస్తున్న శ్రీకృష్ణ సంఘం సభ్యులు